# తూరుపునాటి కూలోళ్ళు

పతేటా ఆమని[1] మొదలయేతప్పటికల్లా, తూరుపునాటి కొత్త కూలోళ్ళు దిగుతారు, కొత్త కూలోళ్ళంటే వాళ్ళు కొత్తవాళ్ళేం గాదు, యాటా వొచ్చేవాళ్ళు కొత్తవాళ్ళెట్టయితారు ? ఉండూరోళ్ళు గాక, ఆ టయానికట్టా వొచ్చి ఆ రోంత ఆమని అయిపోతానే, మల్లా ఎక్కడోళ్ళక్కడికి పోయే దాన వాళ్ళను కొత్తకూలోళ్ళంటారు. యాన్నో దేసెంలో యేయో పచ్చులు ఒక టయంలో వొచ్చి రోన్నాళ్ళుండి, మల్లా వొచ్చిన్తావుకు ఎగిరిపోతా వుంటాయని సెస్తారే, అట్టయిాళ్ళు గుడకా వొచ్చి పోతాంటారు. రావడం, పోడం అట్టుంటాదని సెప్పడం తప్ప, పచ్చులకూ, మనుసులకూ యాడన్నా సమందమా?

అచ్చరే గానీ అందరికీ తెల్చిందే.... తూరుపునాడంటే యాన్నో పొద్దుపొడ్సేకాడని కాదు, వాళ్ళంతా బద్వేలూ, ఆ పక్క కొండకింద పల్లెలోళ్ళే. పెద్ద దూరాబారమోళ్ళు గాదు. వాళ్ళకు నిత్తెకరువు. ఎప్పుడొచ్చినా, సెరువులో నీళ్ళు ల్యాక యీ యేడు పనుల్లేవంటా వుంటారు. వాళ్ళ కరువూ, ఆ కరువు బతుకులూ సూస్తావుంటే.... 'ఒరే యీాళ్ళు యిన్నేండ్ల నుంచీ యిట్టనే ఎట్ట బతుకుతావుండారబ్బా' అని యిసిత్రమయితాది.

ఎప్పుడూ వొచ్చే మనిసి యెవురో ఒకరు రానట్టు కనుక్కోని పలానా ఆయప్పో, ఆయమ్మో రాలేదేమని అడిగితే.... "కాలమైపాయెనే?" అని, అద్దేలీదా అన్నెట్టు సెస్తారు. "ఎట్టా? ఏ మొచ్చి పాయెనబ్బా?" అనడిగితే, "ఏ మొచ్చేదేముంది? పనులు ల్యాకపాయె, ఓపికున్నోళ్ళంతా దేసెం మీద పడిపోయిరి. ఆ మనిసి పాల్యాకపాయె, పాయె". అంతే! ఆ మనిసి కత అయిపాయె. ఆయప్పో, ఆయమ్మో యాటా పనుల కోసం వొచ్చినోళ్ళే. పని యెతుక్కొంటా వొచ్చేశకిత్తి వున్నప్పుడు వొచ్చినారు, లేనప్పుడు 'కాలమై పాయిరి'! ఇట్టా వున్నెప్పుడు, 'యిన్నేండ్ల నుంచీ ఎట్టా బతుకుతా వుండారబ్బా!' అని ఎందుకనిపిచ్చదూ?

వాళ్ళు ఊళ్ళో దిగిన్రోజుకూ, పనులైపోయి ఊళ్ళకు తిరిగిపోయే తప్పటికీ శానా తేడా వుంటాది. రోజూ పన్లో సూస్తావుండేదాన పలానా అని కనుక్కోవల్చిందే గానీ ల్యాకపోతే, ఆ వొచ్చినోళ్ళు యేరే అనుకోవాల్చిందే. అంత మారిపోయుంటారు ! వచ్చిన్రోజున వుతికిన గుడ్డలు కట్టుకోని, సమురు పూసి అనగదువ్విన నెత్తుల్తో, నగుతా నగుతా వుంటారు. ఆ నగుతాన్నెప్పుడు వాళ్ళు వొయిసోళ్ళయితే వొయిసు కనపడ్తానే వుంటాది. వాళ్ళు ఎవురెవురికి మామూలుగా పన్లకు పోతావుంటారో వాళ్ళ యిండ్లకు నేరుగా వొస్తారు.

వొచ్చి, మరియాదలు అక్కర్లేని మంచి సుట్టాలాల అందరూ బాగుండారా, సిన్నామెకు పెండ్లి జేసినారా, ఏ పూరి కిచ్చిరి, పెద్దాయిన కింగా పిల్లోళ్ళు పుట్నే లేదా.... యిట్ట యిశారిస్తారు[2]. రోంత సేపుటికల్లా, వాళ్ళు అడిగేదీ, యీాళ్ళు సెప్పేదీ అయిపోతాది. యింగలేసి, యా సత్రంలోకో, దేలం[3] లోకో, ల్యాకపోతే బెమ్మాండంగా వుండే పెన్నేట్లోకోపోయి పెండ్లోళ్ళ మాదిరి ఆ పూట యిడిది సేస్తారు. అయితే, యీ పెండ్లోళ్ళు పస్తు పండుకొనే పెండ్లోళ్ళు! మర్సటిరోజు నుంచీ వాళ్ళు తూరుపునాటి కొత్త కూలోళ్ళూ, యీాళ్ళు వాళ్ళతో పన్లు సేసిచ్చుకొనేవాళ్ళూ అయిపోతారు.

---

1) పంటల కాలం 2) అడిగి తెలుసుకుంటారు 3) దేవళం

బియ్యం, ఉప్పు, మిరపకాయ, ఉల్లిగడ్డా కొనుక్కోని, పుల్లా పుడకా యేరుకోని, ఉండూ రోళ్ళాలయికొత్త కూలోళ్ళు బువ్వొండుకోలేరు. తెల్లార్జాముున లేసి, గుంటికెలంబడీ సేలల్లోకి పోయి, సీకటి పన్నాక ఊరుజేరతావుంటారు. అందుకని, యీళ్ళకు సేలో బెట్టే రొండు ముద్దల సంగటి గాక, రాత్రికి యింటి కాడ యింగో ముద్ద సంగటి పెడ్తారు. అట్ట పెట్టకపోతే, ముందురోజు మధ్యాహ్నం తిన్న సంగట్తో మర్సరోజు మధ్యాహ్నం దాకా వుండలేరనీ, ఒకేల వున్నా పన్జేయలేరనీ యీ ఏర్పాటు చేస్తారు.

యీ తూరుపునాటి కొత్త కూలోళ్ళకు సంగటి పెట్టల్యాక సచ్చిపోతా వుండామని శానామంది తిట్టుకొంటానే వుంటారు గానీ, కసాల కొద్దీ ఉండూరోళ్ళు సాలక వాళ్ళతో పని సేపిచ్చుకోవాల్చిందే. అందుకని ఆ రోన్నాళ్ళూ ఎట్టనో పెడ్తారు. యీళ్ళ సంగతి యిట్టుంటే కూలోళ్ళ సంగతి సూడాల యింగ. మామూలుగానే ఆమని కాలం ఆకలెక్కువ. సేలో తిన్న రెండు ముద్దల సంగటి రోంతసేపు పనిసేసేతప్పటికే అరిగిపోతాది. రాత్రి మల్లా ముద్ద సంగటి తినే లోపల వాళ్ళ తనకలాట సూడాల!

ఇంటింటి కాడా గబ్బు నూనె బుడ్డీ[4] ఎల్తర్లో వాళ్ళు బేర్లు[5] తీరి కూకోని, ఆ ముద్ద సంగటి కోసం యెప్పుడొస్తాదా అని, సూస్తా వుంటారు. గంపతో ఉడుకుడుకు సంగటి తెచ్చి బయటపెడ్తానే, ఆ వాసన సూసి కూలోళ్ళ పోయే పానం లేసొస్తాది. తలా ఒక ముద్ద సంగటి పెడ్తా వుంటే, ఆ ముద్దను వాళ్ళు ఎంతో బకితితో రొండు సేతుల్తో అందుకోడమూ, అందుకోని ఒక్కొక్క రొవ్వే తుంచుకోని కూరాకులోనో, కారెంలోనో అద్దుకోని, అప్పుడే అయిపోతాదేమోని తింటా వుండడం.... అజ్జూసినోళ్ళు బతికినంత కాలం మర్సిపోలేరు. ఆ ముద్ద సంగట్లోకి మూడు మాట్లు పప్పో, కారమో యేయిచ్చుకొంటారు. రెండు మాట్లన్నా, సంగటి గుడ్డమీద బెట్టి, దోసిడి బట్టి సెంబెడు సెంబెడు నీళ్ళు తాగుతారు. ఆ సలికాలం అన్ని నీళ్ళు తాగేది దప్పికై కాదు, ఆకలి తగ్గిచ్చుకోని ఆ ముద్ద సంగట్తో సరిపెట్టుకోవాలని.

ఆ కూలోళ్ళల్లో బద్వేలు సెరువు కింద అరెకరో, కాలెకరో బూమి వుండేవాళ్ళూ వుండారు. కుంటిమల్లాడ్డి, బాల్నాగమ్మ, పల్నాటి యుద్దెం కతలూ, గోత్రాలూ సెప్పే పిచ్చికుంటోళ్ళూ వుండారు. ఆవుల పబ్బంలో కాటంరాజు కతసెప్పే గొల్లోళ్ళూ వుండారు. తెల్లార్జామున సలికి వొనుక్కుంటూ, బీడీలు తాక్కుంటా బండ్లో కూకోని పోయేతప్పుడు యెవురో ఒకరు 'ఓరోరి కాటం రాజో!' అని గంగమ్మ పాటెత్తుకొంటాడు. సీకట్లో మునిగిన సేలన్నీ ఆ పాటతో ఉలిక్కిపడి మేలుకొంటాయి. గుంటికెనకాల సెనక్కాయ మండల్నెదిరి కుప్పలు పెడ్తా వుండే ఆయప్పెవరో వున్నట్టుండి, బాలసెంద్రుని పెతిగ్నె ఎత్తుకొంటాడు. గుంటికె గుంజే ఎద్దులక్కూడా వుశారొస్తాది.

పన్లయిపోయిన మర్సనాడు తెల్లార్జామున్నే ఊళ్ళకు బయల్దేరాలని కొత్త కూలోళ్ళు తొక్కులాడ్తారు. జొన్న కోతల్దాకా వుండమంటే "యాడుంటామయ్యా, యింటికాడెట్టుండారో!" అంటారు. ఊళ్ళకు పోయేతప్పుడు, సింపిరి జుట్లతో పెరిగిన గడ్డాల్తో మొగోళ్ళూ, మారు కోక ల్యాక సిరుగుపాతల్తో ఆడోళ్ళూ.... యీ రొన్నాళ్ళకే పదేండ్లు పైబన్నట్టు అగుపిస్తారు. సల్లో, ఎండలో, సగం నిండిన కడుపుల్తో వుండి బాల్నాగమ్మలూ, బాలసెంద్రులూ ఎన్నాళ్ళకు సంపాయిచ్చుకోని పోతారో తెల్దు.

పదిరోజుల కిందట వాళ్ళ ఊళ్ళల్లో బతుకుతెరువు లేదని వొచ్చినోళ్ళే అదలా బాదలా పరుగెత్తావుండారు. ఈ పది రోజుల్లో యీళ్ళు యెట్టయిపోయినారో సూస్తే పరాయి చోట పన్జేయడం ఎంత దెబ్బో తెలుస్తాది. యిట్టా పనులెతుక్కుంటా పోయి.... పోయి.... ఆకిరికి పోల్యాక యీళ్ళు గూడా....!

---

4) కిరోసిన్ బుడ్డి దీపం 5) పంక్తులు